సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం, 12, ఏప్రిల్, 2023



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి. మార్కెట్‌కు 334 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.8.50

అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.8.50, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.5.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
41.3°/22.6°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా



అనంతపురం టౌన్: అనంతపురంలోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి ఎ.కళ్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిగ్రీతోపాటు బీటెక్ పూర్తి చేసిన నిరుద్యోగులకు ప్రముఖ ఆటోమేటివ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ధర్మవరం, పెనుకొండ, పుట్టపర్తి, గోరంట్ల, అనంతపురం, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో విధులు కొనసాగించాల్సి ఉంటుందన్నారు. నెలవారీ జీతం రూ.14వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 13న విద్యార్హత పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

సైన్స్ ప్రశ్నపత్రంపై అవగాహన కల్పించండి

పుట్టపర్తి టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో సైన్స్ ప్రశ్న పత్రం గురించి విద్యార్థులకు ముందుగానే ఇన్విజిలేటర్లు అవగాహన కల్పించాలని ప్రభుత్వ పరీక్షల సంచాలకులు దేవానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సైన్స్ ప్రశ్నాపత్రం పార్టు -ఏలో 1 నుంచి 16 ప్రశ్నలు ఫిజికల్ సైన్స్, 17 నుంచి 33 వరకు బయోలాజికల్ సైన్స్ ప్రశ్నలు ముద్రించి ఉంటాయన్నారు. విద్యార్థుల విడివిడిగా ఓఎంఆర్ షీట్లు ఉన్న 12 పేజీలు ఒకే సారి అందిస్తామన్నారు. సమాధానం రాసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫిజికల్ సైన్స్ ఓఎంఆర్‌లో ఫిజికల్ సైన్స్ జవాబులు మాత్రమే రాయాలన్నారు. అలాగే బయోలాజికల్ ఓఎంఆర్‌లో బయోలాజికల్ ప్రశ్నలకు వాటి సమాధానాలే రాయాల్సి ఉంటుందన్నారు.

క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్

అనంతపురం: మే 15న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ క్రిమినల్ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా జడ్జి, జాతీయ న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జి.శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, ఏఎస్పీ నాగేంద్రుడు, శ్రీసత్యసాయి జిల్లా అడిషనల్ ఏఎస్పీ రామకృష్ణ ఇతర పోలీసు అధికారులతో జిల్లా జడ్జి సమీక్ష నిర్వహించారు. లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి గరికపాటి దీనబాబు పాల్గొన్నారు.

తూకం..అంతా మోసం

- యథేచ్ఛగా వ్యాపారుల దందా
- 25 కిలోల బియ్యం బస్తాపై 26 కిలోల స్టిక్కర్
- వినియోగదారులతో అదనంగా డబ్బు వసూలు
- బ్రాండ్ల పేరుతో భారీగా దోపిడీ చేస్తున్న వైనం
- ఫిర్యాదులు వెల్లువెత్తినా పట్టించుకోని అధికారులు

- పుట్టపర్తిలోని ఓ దుకాణంలో 25 కిలోల బియ్యం బస్తా రూ.1,450 ప్రకారం విక్రయిస్తున్నారు. అంత ధర ఏమిటని వినియోగదారుడు ప్రశ్నించగా, అందులో 26 కిలోలు ఉన్నాయని.. కావాలంటే సంచిపైన స్టిక్కర్ చూడాలంటూ షాపు యజమాని సమాధానం ఇచ్చాడు. అక్కడ పరిశీలించేందుకు త్రాసు లేదు. ఇంటికెళ్లాక చూస్తే 25 కిలోలే ఉన్నాయి. షాపు దగ్గరకు వెళ్లి నిలదీయగా.. 'నాకేం తెలుసు. ప్యాకింగ్ వచ్చింది. నాకు 26 కిలోల ప్రకారమే అమ్మారు. నేను అదే ధరకే విక్రయిస్తున్నా' అని సమాధానం ఇచ్చాడు.
- పుట్టపర్తిలోని మరో దుకాణంలో బ్రాండెడ్ బియ్యం పేరుతో రంగురంగుల సంచుల్లో బియ్యం నింపి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అందులో కల్తీ ఉన్నట్లు వినియోగదారుడు గుర్తించాడు. ఇదే విషయాన్ని దుకాణం నిర్వాహకుడిని అడిగితే 'ఇష్టం ఉంటే కొను.. లేదంటే లేదు. అధికారులకు కూడా నెల మామూళ్లు ఇస్తున్నాం. ఎవరూ ఏమి చేయలేరు' అని ఘాటుగా సమాధానం చెప్పాడు.

..ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రతి సరుకులో తూకాల్లో తేడా, కల్తీ రాజ్యమేలుతున్నాయి. వినియోగదారుల నుంచి ఫిర్యాదులూ వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారు.



సాక్షి, పుట్టపర్తి: నిత్యావసరాల డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారులు భారీ దందా చేస్తున్నారు. తూకాల్లో తేడా చేస్తూ వినియోగదారులను నిలువునా మోసం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మొద్దునిద్రలో.. మామూళ్ల మత్తులో కాలయాపన చేస్తున్నారు. ఫలితంగా వ్యాపారుల అక్రమదందా యథేచ్ఛగా సాగుతోంది. అంతేకాకుండా కల్తీ దందా రాజ్యమేలుతోంది. బియ్యం బస్తాల నుంచి కారంపొడి పొట్లాల వరకు అన్నింటిలోనూ తూకాలు తేడాగా ఉన్నాయి. బియ్యం బస్తాపై 26 కిలోల స్టిక్కర్ ఉన్నా... 25 కిలోలకు మించి ఉండటం లేదు. కారంపొడి ప్యాకెట్‌పై 250 గ్రాములు అని రాసి ఉన్నా... 230 గ్రాములకు మించి తూగడం లేదు.

బియ్యం వ్యాపారుల కొత్త దందా

బియ్యం వ్యాపారులు కొత్త దందాకు తెరదీశారు. ఇన్నాళ్లూ నాసిరకం బియ్యాన్ని పాలిష్ చేసి జనానికి అంటగట్టిన కొందరు వ్యాపారులు ఇప్పుడు రూటు మార్చారు. తూకాల్లో తేడా చేస్తూ దర్జాగా దోచేస్తున్నారు. 25 కిలోల బియ్యం బస్తాపై 26 కిలోలుగా ముద్రించి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. తూకం చూసుకుని ప్రశ్నించిన వినియోగదారులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

బ్రాండెడ్ పేరుతో దోపిడీ

కొందరు మిల్లర్లు, బియ్యం దుకాణదారులు బ్రాండెడ్ పేరుతో మాయాజాలం చేస్తున్నారు. రంగురంగుల సంచుల్లో సాధారణ బియ్యాన్నే ఉంచి అమ్మకాలు జరుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. బ్రాండెడ్ స్టిక్కర్ వేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కో వ్యాపారి తమ వద్ద 40 శాతం బ్రాండెడ్ బియ్యానికి 60 శాతం సాధారణ బియ్యం మిక్స్ చేసి ప్యాక్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు.

వసూళ్లతో సరి

కల్తీ వస్తువుల పరిశీలనలో ఆహార భద్రతా అధికారులు విఫలమవుతున్నారు. తూకాల్లో దగా చేస్తున్నా.. తూనికలు, కొలతల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారు. అనుమతులు, జరిమానాల రూపంలో ఖజానాకు చేరాల్సిన సొమ్ములతో జేబులు నింపుకొంటున్నారు.

డిమాండ్‌కు అనుగుణంగా

నిత్యావసర సరుకుల్లో తూకాల్లోనూ తేడా ఎక్కువగా ఉంటోంది. కొందరు వ్యాపారులు వినియోగించే త్రాసుల్లోనే తేడాలుంటున్నాయి. పాయింట్లు సరిగా



ధర్మవరంలోని దుకాణంలో బియ్యంసంచి తూకం పరిశీలిస్తున్న తూ.కొ. అధికారి

చూపించినా.. తూకాలు తక్కువగా ఉంటున్నాయి. ఎక్కువగా అమ్ముడయ్యే వస్తువుల ప్యాకెట్లు కూడా తూకాల్లో బాగా తేడా ఉంటున్నాయి. కిలోకు 50 నుంచి 70 గ్రాముల వరకు తక్కువగా ఉంటున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇక బియ్యం బస్తాలపై అయితే ఒకట్రెండు కిలోలు తక్కువగా ఉంటున్నాయి. ఇప్పటికైనా తూనికలు, కొలతల శాఖ అధికారులు స్పందించి 'తేడా' వ్యాపారుల ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

353 ఏడాదిలో నమోదు చేసిన కేసులు

రూ.57,77,175 వసూలు చేసిన స్టాంపింగ్ ఫీజు

రూ.31,25,600 జరిమానా రూపంలో వసూలు చేసిన మొత్తం

తనిఖీలు చేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా రోజూ తనిఖీలు చేస్తూనే ఉన్నాం. అయితే సిబ్బంది కొరత కారణంగా ఒకే రోజులో చాలా ప్రాంతాలకు వెళ్లడం సాధ్యం కాదు. కానీ ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందిస్తున్నాం. తనిఖీలు చేసి తేడాలు గమనిస్తే వెంటనే చర్యలకు సిఫారసు చేస్తున్నాం. – మహమ్మద్ గౌస్, తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్

నిరుద్యోగ యవతకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో 'సీడాప్', డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రిటైల్ విభాగం, కంప్యూటర్ బేసిక్స్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్స్, సాఫ్ట్ స్కిల్స్‌లలో మూడు నెలలు పాటు అనంతపురంలో ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ సమయంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉచిత హాస్టల్, భోజన సౌకర్యం ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. 18 నుంచి 26 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకంతో పాటు 5 పాస్‌పోర్టుసైజ్ ఫొటోలతో అనంతపురం పంగల్‌రోడ్డులోని నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో (టీటీడీసీ) సంప్రదించాలన్నారు. వివరాలకు 9640899337 నంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఎలాంటి పైరవీలూ వద్దు

- పారదర్శకంగా డీఎస్సీ–98 కౌన్సెలింగ్ చేపడతాం
- నేడు 1 నుంచి 280వ సంఖ్య వరకు కౌన్సెలింగ్



ఖాళీలపై ఏడీ, సిబ్బందితో కసరత్తు చేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడు రూరల్: డీఎస్సీ –98 అభ్యర్థులు స్థానాల కోసం ఎలాంటి పైరవీలూ చేసుకోవద్దని డీఈఓ ఎం.సాయిరామ్ స్పష్టం చేశారు. డీఎస్సీ–98లో అర్హత సాధించిన అభ్యర్థుల మెరిట్ జాబితా మేరకు పారదర్శకంగా కౌన్సెలింగ్ చేపడతామన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు వరుస నంబరు 1 నుంచి 280 వరకు గల అభ్యర్థులకు అనంతపురం సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ప్రారంభవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 536 మంది అభ్యర్థులకు పోస్టింగులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఇంటర్వ్యూ లెటర్, ఒరిజినల్ విద్యార్హత పత్రాలు, ఆధార్‌కార్డ్, 3 ఫొటోలు, సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలని సూచించారు.

ఖాళీలపై సుదీర్ఘంగా కసరత్తు

ఖాళీలపై మంగళవారం సుదీర్ఘంగా కసరత్తు చేశారు. ఏడీ కృష్ణయ్య, సిబ్బందితో డీఈఓ కూర్చుని విద్యార్థుల సంఖ్య, పని చేస్తున్న టీచర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని ఎక్కడైతే కచ్చితంగా అవసరమో ఆ ఖాళీలను గుర్తించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి స్కూల్‌లోనూ టీచరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. కౌన్సెలింగ్ సమయంలో ఖాళీలను ప్రకటిస్తాని డీఈఓ తెలిపారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను పిలిపించి ఖాళీలను చూపిస్తూ ఎంపిక చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గైర్హాజరైతే రెండోరోజు కూడా వారికి అవకాశం ఇస్తామన్నారు. రెండోరోజు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఎవరైనా వచ్చినా అనుమతివ్వబోమని స్పష్టం చేశారు.

అగ్రవర్ణ అతివకు అండ

- 'ఈబీసీ నేస్తం'తో ఆర్థికంగా ఆదుకుంటున్న సర్కార్
- నేడు ఖాతాల్లో నగదు జమచేయనున్న సీఎం జగన్
- జిల్లాలోని 16,467 మందికి రూ.24.70 కోట్ల లబ్ధి



పుట్టపర్తి అర్బన్: మహిళ సంక్షేమం, సాధికారతే లక్ష్యంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అగ్ర వర్ణాల్లోని మహిళలకు అండగా నిలుస్తోంది. అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మేలుచేసేందుకు మెరుగైన జీవనోపాధి, ఆర్థిక సాధికారత కల్పించేందుకు 'వైఎస్సార్ ఈబీసీ నేస్తం' పథకం అమలు చేస్తోంది. ఈ పథకం కింద 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున మూడేళ్ల పాటు రూ.45 వేలు అందించనుంది. 2021–22లో మెదటి విడతలో 'ఈబీసీ నేస్తం' కింద జిల్లాలోని 16,028 మంది మహిళలకు రూ.24.04 కోట్లు అందజేశారు. రెండో విడత (2022–23) మొత్తాన్ని బుధవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం సభ నుంచి నేరుగా మహిళల ఖాతాల్లోకి జమచేయనున్నారు. రెండో విడతలో జిల్లాలోని 16,467 మంది మహిళల ఖాతాల్లో రూ.24.70 కోట్లు జమ కానున్నట్లు అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తారని బీసీ కార్పొరేషన్ అధికారి నిర్మలజ్యోతి

నియోజకవర్గం	లబ్ధిదారులు	నిధులు(రూ.లక్షల్లో)
ధర్మవరం	3,637	545.55
హిందూపురం	2,691	403.65
కదిరి	3,425	513.75
మడకశిర	660	99.00
పెనుకొండ	2,598	389.70
పుట్టపర్తి	3,456	518.40
మొత్తం	16,467	2,470.05

తెలిపారు. రెండో విడత లబ్ధిదారుల్లో కమ్మ వర్గానికి చెందిన వారు 2,078 మంది, రెడ్లు 12,225 మంది, ఆర్యవైశ్యులు 1,302 మంది, బ్రాహ్మణులు 557 మంది, క్షత్రియులు 8 మంది, వెలమలు 55 మంది, ఇతర ఓసీ కులాలకు చెందిన వారు 242 మంది ఉన్నట్లు వెల్లడించారు.

సామాజిక విప్లవకారుడు పూలే

- జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: అంటరాని తనంపై పోరాటంతో పాటు మహిళా విద్యకు పెద్దపీట వేసిన మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక విప్లవకారుడని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లోని 'స్పందన' హాలులో ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుడా చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు. తొలుత పూలే నిలువెత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు, వెనుకబడిన తరగతుల సంక్షేమానికి పాటు పడిన మహనీయుడు పూలే అన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్న పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అప్పట్లోనే విద్యా వ్యాప్తికి పాఠశాలలు స్థాపించిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. పూలే స్త్రీలకు విద్య నేర్పించడంతో పాటు వితంతు పునర్‌వివాహాలను ప్రోత్సహించారన్నారు. అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల వారికి ఆత్మస్థైర్యం



పూలేకు నివాళులర్పిస్తున్న జేసీ చేతన్, అధికారులు

నింపారని కొనియాడారు. అనంతరం జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ముదిగుబ్బ జెడ్పీటీసీ సభ్యుడు సేవే నాయక్ తదితరులు మాట్లాడుతూ, పూలే బాటలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో తపన పడుతున్నారన్నారు. మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల విద్యాసంస్థలు ఏర్పాటు చేశారన్నారు. బాల బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు, వసతి గృహాలు, విద్యాదీవెన, వసతి దీవెన, లాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మలాజ్యోతి, శివరంగప్రసాద్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రాజకుల్లాయప్ప, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీఎంఐపీ అధికారి సుదర్శన్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎమ్మార్‌పీఎస్ నాయకులు రామాంజనేయులు, పైపల్లి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమా తప్పనిసరి



నల్లమాడ: పూడికతీత పనులను పరిశీలిస్తున్న పీడీ రామాంజనేయులు

నల్లమాడ: ఉపాధి కూలీలందరికీ తప్పనిసరిగా బీమా చేయించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు క్షేత్రస్థాయి సహాయకులకు సూచించారు. మంగళవారం ఆయన, మండల పరిధిలోని బొగ్గలపల్లి వద్ద జమాల్‌ఖాన్‌కుంట పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వారానికి రూ.1,700, వంద రోజులకు రూ.27 వేలు కూలి అందేలా అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనులు చేయాలని కూలీలకు సూచించారు. కూలి డబ్బులు తీసుకునేందుకు బ్యాంక్‌కు వెళ్లినప్పుడు ప్రతి ఒక్కరూ రూ.20 చెల్లించి ప్రమాద బీమా చేసుకోవాలన్నారు. తద్వారా రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు.

రోజూ రూ.272 వేతనం అందేలా చూడాలి

ఓడీ చెరువు: ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజూ రూ.272 మేర వేతనం అందేలా చూడాలని డ్వామా పీడీ రామాంజనేయులు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని డబురువారిపల్లి, వెంకటాపురం, సున్నంపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న 'అమృత్ సరోవర్' పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవిలో కూలీలకు తాగునీరు, నీడ సదుపాయం కల్పించాలన్నారు.

లోకేష్‌వి తప్పుడు కూతలు

- బీసీల పేరెత్తే హక్కు టీడీపీకి లేదు
- వైఎస్సార్‌సీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి
- ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: తమది బీసీల పార్టీ అని, తమ పార్టీలోనే బీసీలకు నిజమైన గౌరవం దక్కుతుందని పాదయాత్రలో నారా లోకేష్ చెబుతున్న విషయాలన్నీ తప్పుడు కూతలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో ఆ పార్టీలో బీసీలకు గౌరవం దక్కేదని, ఆయన నుంచి టీడీపీని లోకేష్ తండ్రి చంద్రబాబు లాక్కుని ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడిచారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశారన్నారు. అందువల్లే బీసీలు రాజకీయంగా ఎదగలేకపోయారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ బీసీలకు అండగా నిలిచిందన్నారు. తమ నాయకుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

కాదని, బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని గట్టిగా నమ్మి అన్ని విధాలుగా అవకాశాలు కల్పించారన్నారు. అందువల్లే ప్రస్తుతం కురుబలకు రెండు ఎమ్మెల్యే, మంత్రి పదవి, ఒక ఎంపీ పదవి దక్కిందన్నారు. వాల్మీకులకు జెడ్పీచైర్‌పర్సన్ పదవి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, హిందూపురం మున్సిపల్ చైర్మన్ పదవులు, ఇటీవలే మాజీ ఎంపీ గంగాధర్ సతీమణి మంగమ్మకు ఎమ్మెల్సీ దక్కిందన్నారు. ఇదంతా బీసీలపై జగన్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమన్నారు. ఇవన్నీ తెలుసుకుని లోకేష్ బీసీల గురించి మాట్లాడితే బాగుంటుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2018 వరకు బీసీలకు ఒకటో, రెండు ఎమ్మెల్యే సీట్లు దక్కాయని, అయినా లోకేష్ తాము బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్నారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతిపై నిజంగా టీడీపీకి చిత్తశుద్ధి ఉంటే... లోకేష్ అనంతపురం జిల్లా దాటేలోగా వైఎస్సార్ సీపీ ఇస్తున్నంత ప్రాధాన్యత తమ పార్టీలోనూ బీసీలకు ఇస్తామని చెప్పాలన్నారు.

కమ్మ సవితమ్మకే టికెట్

వచ్చే ఎన్నికల్లో 'కమ్మ' సవితమ్మకు పెనుకొండ టీడీపీ టికెట్ ఇవ్వాలని అనుకుంటున్నారని, ఆ పార్టీలోని బీసీలకు దమ్ము, ధైర్యం ఉంటే తమకు టికెట్ ఎందుకు ఇవ్వరని తమ అధినేతను నిలదీయాలన్నారు. కేవలం ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను మోసం చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. టీడీపీలోని బీసీ సోదరులు ఇప్పటికైనా కళ్లు తెరిచి జగనన్న బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యతను గమనించాలన్నారు. వైఎస్సార్ సీపీ బీసీల పార్టీ అని బీసీలంతా చెబుతున్నారని, అందువల్లే వారంతా వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారన్నారు. దీన్ని లోకేష్ గ్రహించాలని ఎమ్మెల్యే శంకరనారాయణ హితవు పలికారు.

మహాలక్ష్మీ నమోస్తుతే

- ముగిసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మిదేవి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల ముందు రోజు రాత్రి (సోమవారం) పోతరాజుల బండారు మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా స్వాగతం పలికి విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇక బ్రహ్మోత్సవాల ముగింపు రోజున అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, కుంకుమార్చన, తులసీపూజ చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పట్టు వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలను అలంకరించి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేల సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ సమీపంలో టెంట్లు వేసి బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో కలిసి సహపంక్తి విందు భోజనం చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక మెడకు బిగుసుకున్న ఉయ్యాల తాడు



చికిత్స పొందుతున్న బాలిక

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు మెడకు ఉయ్యాల తాడు బిగుసుకోవడంతో ఓ బాలిక తీవ్ర అస్వస్థతకు లోనైంది. వివరాలు... ధర్మవరంలోని తారకరామాపురానికి చెందిన రంగనాథ్, చౌడేశ్వరి దంపతులు కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మంగళవారం ఉదయం వీరి చిన్న కుమార్తె బిందుసాయి ఇంటి వద్ద చెట్టుకు వేసిన ఉయ్యాలతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు మెడకు బిగుసుకుపోయింది. అదే సమయంలో గమనించిన తండ్రి వెంటనే ఊపిరి అందక గిలగిల్లాడుతున్న కుమార్తెను కాపాడి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు.

బడుగుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న రమేష్ గౌడ్, తదితరులు

అనంతపురం సిటీ: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని అనంతపురంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ చైర్మన్ బీసీ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల వారు మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ కార్యాలయం నుంచి బయల్దేరిన బైక్ ర్యాలీ సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా కొనసాగి మళ్లీ జెడ్పీ కార్యాలయం వద్దకు చేరుకుంది. కార్యక్రమాన్ని ఉద్దేశించి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు ఉద్యమించిన పూలే జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. క్లాక్ టవర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌కు పూలే పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోజూ 15 గ్లాసుల నీళ్లు తాగాలి

వడదెబ్బ నుంచి రక్షణ పొందండి ఇలా..

- నీళ్లు, మజ్జిగ, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, ఇతర ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి.
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులనే ధరించాలి.
- రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి.
- పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. రెండు పూటలా స్నానమాచరించాలి.
- భోజనం మితంగా తిని, నీళ్లు అధికంగా తాగాలి.
- ఎండ అధికంగా ఉన్న సమయంలో ఇంటి పట్టునే ఉండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలి.
- ఇంట్లో ఉన్న సమయంలో కిటికీలు తెరిచి ఉంచాలి.



వడదెబ్బ ప్రాణాంతకం

పుట్టపర్తి అర్బన్: సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే వడదెబ్బ ప్రాణాంతకమవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. వేసవిలో 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో వేడిగాలులు వీస్తున్నాయి. దీంతో వడదెబ్బ తగిలే సూచనలున్నాయి. అత్యవసరమైతే తప్పా ఇంటి నుంచి బయటకు రాకూడదని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే రక్షణగా గొడుగు, టోపీ వంటివి తీసుకెళ్లాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండకు వెళ్లకుండా ఉండడమే మంచిదంటున్నారు.

చేయకూడని పనులు

- తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా బయట తిరగరాదు.
- సూర్యకిరణాలు, వేడి గాలికి గురి కాకూడదు.
- రోడ్ల పక్కన ఉన్న చల్లని రంగు పానీయాలు తాగరాదు.
- కలుషిత ఆహారం తినకూడదు.
- మాంసాహారం తగ్గించాలి. మద్యం తాగరాదు.
- ఎండ వేళల్లో శరీరంపై భారం పడేలా పనులు చేయరాదు.
- నలుపు దుస్తులు, మందముగా ఉన్న దుస్తులు ధరించరాదు.

వడదెబ్బకు ప్రథమ చికిత్స

- వడదెబ్బ సోకిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేదాకా తడిగుడ్డతో తుడుస్తూ ఉండాలి.
- చల్లని గాలి తగిలేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఉప్పు కలిపిన మజ్జిగ / చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ /ఓరల్ డీ హైడ్రేషన్ ద్రావణం(ఓఆర్ఎస్) తాగించవచ్చు.

జాగ్రత్త పడాలి



వడదెబ్బ ప్రాణాంతకం. ఇది సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఉపాధి పనులు చేసే కూలీలు సాధ్యమైనంత ఎక్కువగా మంచినీళ్లు తాగాలి. ఉదయం 10 గంటల్లోపు పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవడం ఉత్తమం. గర్భిణులు బయటకు వెళ్లరాదు. చల్లని వేళ్లలోనే బయటి పనులు చక్కబెట్టుకోవాలి. చిన్న పిల్లలను బయటకు పంపరాదు.
– ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్యాధికారి

రేషన్ బియ్యం డంప్ స్వాధీనం

గుత్తి రూరల్: మండలంలోని పెద్దొడ్డిలో అక్రమంగా నిల్వ ఉంచిన 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తెలిపిన మేరకు.. పెద్దొడ్డికి చెందిన తపిల చిరంజీవి కొంత కాలంగా రేషన్ బియ్యాన్ని కర్ణాటక ప్రాంతానికి తరలించి సొమ్ము చేసుకునేవాడు. ఈ క్రమంలో అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం 6.30 గంటలకు విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో చిరంజీవి ఇంట్లో 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించే ఐషర్ వాహనాన్ని సీజ్ చేశారు. చిరంజీవితో పాటు ఆయన ఇచ్చిన సమాచారం మేరకు శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఆర్ఎస్ తండాకు చెందిన బోనాత్ గిరిబాబు, ఐషర్ డ్రైవర్ గోపాల్‌నాయక్, ధర్మవరం నివాసి నర్ రమేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని గుత్తి పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ శేషగిరి, జయపాల్‌రెడ్డి, గుత్తి సీఎస్‌డీటీ కంబక్క, ఏఓ వాసు ప్రకాష్ పాల్గొన్నారు.

సంపులో పడి యువతి మృతి

రొద్దం: ప్రమాదవశాత్తు సంపులో పడి ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... రొద్దం మండలం రాగిమేకులపల్లికి చెందిన శ్రీనివాసులు పెద్ద కుమార్తె కవిత (30) మతి స్థిమితం లేక బాధపడుతోంది. మంగళవారం ఉదయం నీటిని పట్టుకునేందుకు సంపు వద్దకు వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడిపోయింది. లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగి ఊపిరి అందక మృతిచెందింది. కాసేపటి తర్వాత అదే గ్రామానికి చెందిన రసూల్‌బీ సంప్ వద్దకు వెళ్లినప్పుడు నీటిలో తేలియాడుతున్న కవిత మృతదేహాన్ని చూసి కేకలు వేసింది. కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని కవిత మృతదేహాన్ని వెలికి తీశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పూలే ఆశయసాధనకు కృషి చేద్దాం

- ఎమ్మెల్యే శంకరనారాయణ పిలుపు



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, తదితరులు

పెనుకొండ: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేద్దామంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని మంగళవారం ఆయన ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే చేసిన కృషిని కొనియాడారు. పూలే ఆశయ సాధన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పూలే, అంబేడ్కర్ కలలు సాకారం చేస్తూ అణగారిన వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. సీఎం తీసుకుంటున్న చర్యలపై దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంత్రివర్గంలో 70 శాతం, స్థానిక సంస్థల్లో 75 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారీలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. నామినేటెడ్ పనుల్లోనూ 50 శాతం ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నాగలూరుబాబు, బోయనరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్లు సునీల్, నందిని, జయశంకరరెడ్డి, ఎంపీపీ గీత, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకుడు పొగాకు రామచంద్ర, ముఖ్యనాయకులు రామ్మోహన్‌రెడ్డి, ఫరీద్, యాసిన్, శేషాద్రి, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, రామాంజినేయులు, సద్దాం, నేమతుల్లా, మున్నీర్, కిష్టప్ప, రాము, శ్యాం నాయక్, గణేష్, బోయబాబు, శంకరరెడ్డి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు ముందే భూసార పరీక్షా ఫలితాలు

- అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి



మాట్లాడుతున్న అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను వేసే ముందుగానే భూమికి ఏఏ పోషకాలు అవసరమో గుర్తించడానికి ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు. మంగళవారం పుట్టపర్తి రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై వ్యవసాయ అధికారులు, ఆర్‌బీకే సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, భూసార పరీక్ష ఫలితాల అనంతరం సాయిల్ కార్డులో పేర్కొన్న సూచన మేరకు రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. దీనివల్ల పెట్టుబడి తగ్గుతుందన్నారు. తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ, మట్టి పరీక్షల ద్వారా భూమిలో సల్ఫర్, మాంగనీస్, జింక్, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాల లభ్యతను గుర్తించవచ్చన్నారు. పరీక్షల అనంతరం సమగ్ర వివరాలతో సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందజేస్తామన్నారు. మట్టి నమూనాలు వేసవిలోనే సేకరించాలన్నారు. పంట తొలగించిన అనంతరం నమూనాలు తీయాలన్నారు. భూమిలో బండల దగ్గర, నీళ్ల పారేచోట, చెట్ల కింద, బావుల దగ్గర ఎరువులు వేసిన చోట నమూనాలు తీయకూడదన్నారు. భూమిని 15 సెంటీమీటర్ల లోతు తవ్వి నమూనా సేకరించాలన్నారు. ఒక్కో పొలంలో 10 చోట్ల తీయాలన్నారు. నమూనాలను భూసార పరీక్షా కేంద్రాలకు పంపి పరీక్షల అనంతరం సాయిల్ కార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సైంటిస్ట్ రవికిషోర్, ఏడీఏలు స్వయంప్రభ, కృష్ణమీనన్, కృష్ణయ్య, సత్యనారాయణ, అల్తాఫ్, మండలస్థాయి అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మానమంటే.. పురుగుల మందు తాగాడు!



మృతుడు రంగయ్య

శెట్టూరు: మద్యం తాగొద్దంటే పురుగుల మందు తాగి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన రంగయ్య (60) క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స అందజేస్తున్న వైద్యులు.. మద్యం మానాలని సూచించారు. అయినా రంగయ్య రోజూ మద్యం సేవించేవాడు. దీంతో శనివారం కుటుంబ సభ్యులు మందలించారు. ఇలాగైతే జబ్బు ఎప్పటికీ నయం కాదని, డాక్టర్లు చెప్పినట్లు మద్యం మానేయాలని హితవు పలికారు. దీంతో మనస్తాపం చెందిన రంగయ్య.. అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు.. అపస్మారక స్థితిలో పడి ఉన్న రంగయ్యను గమనించిన వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం ఆయన మృతి చెందాడు. ఘటనపై ఎస్ఐ యువరాజ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన



రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని కోన సమీపంలో ఉన్న మూడు రైల్వే అండర్ బ్రిడ్జి పనులను మంగళవారం రైల్వే పెనుకొండ ఇన్‌చార్జ్ కుమార్ అజిత్‌రాగ్, ఆర్డీఓ తిప్పేనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే డబ్లింగ్ పనులు అత్యవసరంగా చేయాల్సి ఉన్నందున కోన నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే మూడు బ్రిడ్జిలను పరిశీలించినట్లు తెలిపారు. వీటిలో ఓ బ్రిడ్జిని ఎంపిక చేసి 90 రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ సుబ్బలక్ష్మి, మండల సర్వేయర్ సంతోషమాత, వీఆర్వో తులసి, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

బొమ్మనహాళ్: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు చెందిన రజాక్ సాహెబ్ (42)కు భార్య మాబున్నీ, ఇద్దరు కుమారులున్నారు. కౌలుకు పొలం తీసుకుని వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. పంటల సాగు, కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి చేరుకున్న రజాక్ సాహెబ్... భోజనం ముగించుకున్న తర్వాత గ్రామ శివారుకు చేరుకుని చెట్టుకు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. గ్రామ శివారున చెట్టుకు వేసుకున్న ఉరికి వేలాడుతున్న రజాక్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అశ్వవాహనంపై చౌడేశ్వరి దేవి విహారం



అశ్వవాహన ఉత్సవంలో ఊరేగుతున్న చౌడేశ్వరమ్మ

అమడగూరు: మండలంలో నిర్వహిస్తున్న చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చౌడేశ్వరీ అమ్మవారు అట్టహాసంగా అశ్వవాహన ఉత్సవంలో దర్శనమిచ్చారు. రెడ్డివారిపల్లికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి, అశ్వర్థమ్మ దంపతుల కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున ఉన్న ఊట్టి వద్ద భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. అక్కడ గ్రామస్తులంతా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకొంటూ కొబ్బరికాయలను సమర్పించారు. గురువారం సింహవాహనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ప్రశాంతి నిలయం.. వేడుకలకు సిద్ధం

- రేపటి నుంచి తమిళ నూతన సంవత్సర వేడుకలు
- 15 నుంచి విషు ఉత్సవాలు

పుట్టపర్తి అర్బన్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం ప్రశాంతి నిలయంలో తమిళ నూతన సంవత్సర వేడుకలు గురువారం నుంచి రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తమిళ సంస్కృతీ సాంప్రదాయాలను మేళవిస్తూ బాబా మందిరాన్ని అలకరించారు. 13వ తేదీ (గురువారం) సాయంత్రం వేదపఠనంతో తమిళ నూతన సంవత్సర వేడుకలు ప్రారంభం కానున్నాయి. అనంతరం సత్యసాయి సేవల ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఉంటుంది. తర్వాత సత్యసాయి యూత్ సభ్యులు 'సత్య కథలు' పేరుతో డ్రామా ప్రదర్శించనున్నారు.14వ తేదీ శుక్రవారం ఉదయం సుందరం భజన్ బృందం సంగీత కచేరీ, పలువురు భక్తుల ఉపన్యాసాలు ఉంటాయి. సాయంత్రం 5.30 గంటలకు త్రిచూర్ బ్రదర్స్ సాయికృష్ణమోహన్, రాంకుమార్ మోహన్ సంగీత కచేరీ ఉంటుంది.

నూతన (విషు) వేడుకలు

15వ తేదీ ఉదయం కేరళ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. సత్యసాయి సేవలపై ప్రముఖుల దివ్య ఉపన్యాసాలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు కేరళ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ సుమన్‌బిల్లా ఉపన్యాసం ఉంటుంది. 5.30 గంటలకు విష్ణుదాస్ కల్లేకులంగర్ సంగీత కచేరీ ఉంటుందని ట్రస్ట్ వర్గాలు తెలిపాయి.

సేవలను మరింత చేరువ చేయండి

- అడిషనల్ డీఎంఈ రాఘవేంద్రరావు



మాట్లాడుతున్న డాక్టర్ రాఘవేంద్ర రావు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రోగులకు మరిన్ని నాణ్యమైన సేవలను చేరువ చేయాలని వైద్యులకు వైద్య విద్య అడిషనల్ డైరెక్టర్ రాఘవేంద్ర రావు ఆదేశించారు. సర్వజనాస్పత్రిని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గైనిక్, జనరల్ మెడిసిన్, సైకియాట్రిక్, పీడియాట్రిక్ ఓపీలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్య విభాగాల అధిపతులతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సమావేశమై మాట్లాడారు. ఆయా విభాగాల్లో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు పూర్తి బాధ్యతతో బోధన చేయాలన్నారు. గైనిక్, పీడియాట్రిక్ యూనిట్లను పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. నవజాత శిశువులకు సంబంధించి ప్రత్యేకంగా ఎస్ఐసీయూను ఏర్పాటు అంశంపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, వైద్య విభాగాల అధిపతులు డాక్టర్ నవీద్ అహమ్మద్, నవీన్‌కుమార్, భీమసేనాచారి, రామస్వామి, సుహాసిని, రామస్వామి, సౌజన్యకుమార్, ఆర్ఎంఓ డాక్టర్ వైవి రావు తదితరులు పాల్గొన్నారు.

మెడికోలకు ఐడెంటిటీ కార్డుల అందజేత

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఐదో సెమిస్టర్ చదువుకుంటున్న విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను అడిషనల్ డీఎంఈ డాక్టర్ రాఘవేంద్ర రావు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో వైద్యవృత్తి చాలా కీలకమని, బాధ్యతాయుతమైన చికిత్సను రోగులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోగుల సమస్యను సావధానంగా విన్నప్పుడే మంచి వైద్యాన్ని అందించేందుకు వీలుంటుందన్నారు. వ్యాధి నిర్ధారణ చేయకుండా ఎలాంటి వైద్యాన్ని అందించరాదని సూచించారు.

అడిషనల్ డీఎంఈకి వినతిపత్రం

ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్ష యోజన కింద కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న 21 మంది ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ కింద మార్చారని, దీని వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేంద్రరావుకు సంబంధిత ఉద్యోగులు విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తమకు ఉద్యోగాలు అందించే సమయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు తెలిపారు. అయితే ఆరు నెలల తర్వాత ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు అందజేశారన్నారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగానే పరిగణించాలని కోరారు.